# సరైన తీర్పు

పోడుకూరి జ తిండ్రాశక్ష



"డాడీ!"

"ఊఁ!"

"సూర్యుడు ఎందుకు రోజూ వెళ్ళిపోతాడు?"

విసుగ్గా కొడుకు సురేష్ వైపు చూశాడు జడ్జి దివాకరరావ్.

ఎపుడో బుద్ధిపుట్టి తీరిగ్గా కొడుకుతో గార్డెన్‌లో పచార్లు చేసే కోరిక పుడితే, ఆవేళ అతనికి పీలైతే, ఇంకా చాలా కారణాలు

కలిసొస్తే కానీ ఆ అవకాశం దొరకదు దివాకరరావ్‌కి. ఆ రోజు సాయంత్రం అన్నీ కలిసొచ్చాయ్! కనుక కొడుకుతో గార్డెనింగ్ చేయ సాగేడు దివాకరరావ్. కానీ అతనికి కొడుకు వరస ఏం నచ్చ లేదు. ఆవేళ సాయంత్రం నుండీ ఒకటే ప్రశ్నలు. "ఈ మొక్క యిలా ఎందుకు పుట్టిందీ?" "నువ్వు ఎందుకు సిగార్స్ అలా కాలుస్తావ్?" "ఆకాశంలో మేఘాలు ఎందుకు పడిపోవు బంతిలా?" అంటూ తన బుద్ధికి తోచిన ప్రశ్నలన్నీ వేసేస్తున్నాడు.

'నోర్మూసుకొని అవతలకి ఫో' అని కసరాలని అతనికి ఎన్ని సార్లో అనిపించింది అప్పటికి. ఏ సెక్షన్‌లో ఏ వీక్ పాయింటుందో చెప్పగలడు అతను. అతనికిముందు పనిచేసిన జడ్జీలు, ఏ కేసులో ఏలా తీర్పు నిచ్చేరో, నిద్రలో లేపి అడిగినా చెప్పగలడు. కానీ యిదేవిఁటి? ఈ ప్రశ్నలకి వివ రంగా జవాబు చెప్తే అర్థంకాని

(మిగతా కథ **74**వ పేజీలో)


చదవండి! చదివించండి!

## బొమ్మరిల్లు పబ్లికేషన్స్

ఈ నెల విడుదలైన నవలలు

## అంగుళి మాల

## విజయ చంద్రిక

వివరాలకు :

బొమ్మరిల్లు పబ్లికేషన్స్

80-ధనలక్ష్మి కాలనీ,

మద్రాసు-600 026.

(సరైన తీర్పు ............... 16వ పేజీ తరువాయి)

వయసు, క్లుప్తంగా చెప్పలేని ప్రశ్నలు. 'ఇంత ఇంటలిజెన్స్ కో షెన్స్ ఎలా వచ్చింది?' ఆశ్చర్యపోసాగేడు దివాకరరావ్.

"చెప్పు డాడీ! వై?" మళ్ళీ రెట్టించి అడిగేడు సురేష్.

ఆలోచనల్లోంచి తెప్పరిల్లేడు దివాకరరావ్. "సాయంత్రం అయింది కనుక!"

"సాయంత్రం ఎందుకు అవుతుందీ?"

"రాత్రవ్వాలి కనుక!"

సురేష్ కీ లాజిక్ నచ్చినట్లుంది. రెట్టించిన ఉత్సాహంతో మళ్ళీ ప్రశ్న వేశాడు—

"రాత్రెందు కవుతుందీ?"

"నువ్వు నిద్రపోవాలి కనుక!" అన్నాడు దివాకరరావ్.

కానీ ఆ మాటలు సురేష్ వరకూ చేరలేదు. బంగళా దాటి, ఆ పైన ఇరవై మీటర్ల తోటదాటి ఫెన్స్‌కి ఆవల వైపు నున్న యింట్లోంచి వచ్చే కేకలూ, దబ్ దబ్ మనే చప్పుడూ ఆ మాటలని సబ్‌డ్యూ చేసేసేయి.

"లంజా! ఎవడితోటే కులకాలి నువ్వు?" తాగిన మాటలు ముద్ద ముద్దగా గాలిలో కలిసి తేలి. వీళ్ళని దాటి వెళ్ళిపోతున్నాయి. ఆ కేకలతో పాటు ఆడదాని ఏడుపూ, "నన్ను చంపేస్తున్నాడు రోయ్!" నాయనోయ్! అమ్మోయ్!" అనే అరుపులూ వినబడసాగేయి.

కాళ్ళు ముందుకి సాగలేదు దివాకరరావ్‌కి. ప్రతి సాయంత్రం జరుగుతూంది ఈ వ్యవహారం. వాడు దాన్ని ప్రతిరోజూ తంతున్నట్లుంది. చాలా సార్లు గమనించేడు అతను.

వాళ్ళు అంటే సూర్యారావ్ మరియూ లక్ష్మి. ఆరు నెలల క్రిందట విశాఖపట్నం నుంచి ఈ వూరు వచ్చేరు. విపరీతమైన అనుమానపు మనిషి సూర్యారావ్. దానికి తోడు లక్ష్మి అందంగా ఉంటుంది. బాగా తయారయితే అనుమానం సూర్యారావ్‌కి-ఎవడితోనో తన భార్య కులుకుతుందేమో నని. తయారవక పోతే ఎవడో దీనికి నచ్చి, తను నచ్చలేదు కనుక అందంగా తయారవడం లేదని కోపం. ఆ అనుమానంతోనే నిత్యం తాగుతాడు. తాగి ఉన్నాడు కనుక పెళ్ళాన్ని ఆ మత్తులో కొడతాడు—ఎవడితో కులుకుతావే అంటూ! లక్ష్మి చాలా

ఓర్పుగలది. మొగుడు ఏనాటికైనా మారుతాడేమోనన్న ఆశతో బ్రతుకు తోంది.

మొదట్లో చాలా అన్యోన్యంగా ఉండేవాళ్ళు వాళ్ళిద్దరూ.

'బ్లడీ రాస్కెల్! పెళ్ళాన్ని ఎందుకలా తంతాడో?' అనుకున్నాడు దివాకరరావ్ వెనక్కి తిరుగుతూ.

సురేష్ ప్రశ్నార్థకంగా మొఖం పెట్టి దివాకరరావ్ వైపు చూస్తున్నాడు. దివాకరరావ్‌కి ఏం చెప్పాలో తోచలేదు.

"పద. మమ్మీ ఏం చేస్తోందో చూద్దాం?" అన్నాడు—కొడుకు చెయ్యి పట్టుకొని బంగాళా వైపు గబగబా అడుగులేస్తూ. "వాళ్ళెందుకు అలా కొట్టుకుంటారు?" అని కొడుకు ప్రశ్న వేస్తాడేమో ననే భయం పట్టుకొంది అతనికి.

కానీ ఆ ప్రశ్న వెయ్యలేదు కొడుకు.

"డాడీ! నువ్వు జడ్జీవి కదా! ఇన్ని తగువులు తీరుస్తావ్ కదా! తప్పు చేసిన వాళ్ళని శిక్షిస్తావ్ కదా! మరి వాడ్నెందుకు పనిష్ చెయ్యవ్?" అడిగేడు సురేష్.

బంగళా మెట్లెక్కబోతున్న దివాకరరావ్ కాలు ముందుకు సాగ లేదు.

ఆ ప్రశ్న కొడుకు వేస్తున్నట్లు తోచలేదు అతనికి. తన సర్వీసూ, తన పదవీ, ఆ పదవీ బాధ్యతా వేస్తున్నట్లు తోచింది.

నిజమే! తనెందుకు ఎప్పుడూ ఆ ప్రయత్నం చెయ్యలేదు?

ఎందువలన?

డబ్బు తీసుకుంటున్నాం కనుక న్యాయాన్ని కోర్టులో అమ్మడం వరకేనా తన పదవికి ముఖ్యోద్దేశం? అందుకనే కోర్టులోకి రాలేదు కనుక ఈ కేసులో తను న్యాయం చెప్ప లేక పోతున్నాడా? యిద్దరు లాయర్లూ, ప్రమాణ స్వీకారం, బూజు పట్టిన కోర్టుహాలూ యివేవీ ఉంటేకానీ తనలో న్యాయాధి పతి పని చెయ్యడా?

దోషి, దోషం చేశాడా లేదా అనే విషయాన్ని నమ్మించడానికి లాయర్లు కావాలి. ఎవరుగెలిస్తే, ఎవరు తనని నమ్మించ గలిగితే వాళ్ళ కేసు గెలిచినట్లు. యిక్కడ సూర్యారావ్ దోషి అని నమ్మించ డానికి తనకి పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవసరం లేదు. ప్రాసిక్యూషన్ సాక్షులు అవసరం లేదు. తనే ప్రత్యక్ష సాక్షి ఈ కేసులో. అనవసరమైన అనుమానంతో పెళ్ళాన్ని అన్యాయంగా హింసి

స్తున్న దోషి ఎదురుగానే ఉన్నాడు. కానీ ఓ అమాయకురాలను రక్షించి న్యాయాన్ని చేకూర్చ లేక పోతున్నాడు.

ఏం చెయ్యాలి?

ఆలోచనలో పడిపోయేడు దివాకరరావ్.

ఆ రాత్రి దివాకరరావ్ భార్య అడిగింది, భర్త ఆలోచనలలో మునిగి ఉండటం గమనించి—

"రేపేదైనా జడ్జిమెంట్ యివ్వాలా?"

"ఊహూఁ!" తల అడ్డంగా ఊపాడు.

"మరి! ఎందుకీ ఆలోచన?"

"జడ్జిమెంట్ యివ్వాలి కనకే ఆలోచించాలా, లేకపోతే అలోచించ కూడదా? మన బంగాళాకి అవతల ఉన్న వాళ్ళని గురించి అలోచిస్తున్నాను."

"వాళ్ళ గురించా?" మళ్ళీ ఆశ్చర్యపోయింది ఆమె. సూర్యారావ్, లక్ష్మిల గురించి ఆమెకి కూడా తెలుసు. మొదట్లో వాళ్ళిద్దరి అన్యోన్యత చూసి ముచ్చట పడింది ఆమె. లక్ష్మితో స్నేహం చేసుకోవాలని ముచ్చట పడింది కూడా. కానీ అందుకు ప్రయత్నం చెయ్యలేదు- జడ్జీగారి భార్యకి ఓ కూలివెధవ పెళ్ళాంతో స్నేహం ఏమిటని. కానీ తరువాత తను తొందరపడి స్నేహం చేసుకోనందుకు ఆమె సంతోషించింది.

"న్యూసెన్సుగా ఉందనా?" అడిగిందామె.

"కాదు. నాకు తెలుసు వాళ్ళ కథ. ఓ రోజు యథాలాపంగా తోటమాలి నడిగేను. అప్పుడు చెప్పేడు. వాడు ఓ అనుమానపు వెధవ. ఎందుకలా వాడు పెళ్ళాన్ని కొట్టాలి? రోజంతా వాడెంత శ్రమ పడుతున్నాడో యిదీ అంతే శ్రమ పడుతోంది కదా! దాన్ని హింసించే హక్కు వీడికెవడు యిచ్చాడు? అది పోలీస్ రిపోర్ట్ యివ్వదేం?" అన్నాడు దివాకరరావ్.

పకపక నవ్వింది దివాకరరావ్ భార్య.

"జడ్జీగారు కలగంటున్నారు. మొగుడు కొట్టినా, చంపినా పోలీస్ రిపోర్ట్ యివ్వరు ఈ దేశపు స్త్రీలు."

"మరి ఎలా?" అన్నాడు.

అర్థమయినట్లునవ్వి అంది. "అది వాడిమీద పోలీస్ రిపోర్ట్ యివ్వాలి. అపుడు పోలీసులు కేస్ బుక్ చెయ్యాలి. మీ దగ్గరకి కేస్ రావాలి. అపుడు మీరు వాడికి వ్యతిరేకంగా తీర్పు యిచ్చి వాడ్ని పనిష్ చేయాలనా మీ ఊహ! మీ కోర్టులు అంత డొంక తిరుగుడుగా ఉండబట్టే

ఎన్నో కేసులు మీ వరకూ రావడం లేదు. అంతేగా?"

"నిజమే. కానీ నీకు తెలుసు, నాకు తెలుసు వాడి గురించి. అది ఏం తప్పు చేయక పోయినా వాడు దాన్ని కొడుతున్నాడని. మరి వాడ్నెలా శిక్షించడం?"

"దేశంలో తప్పు చేస్తున్నాడని తెలిసిన ప్రతి వాడ్నీ మీరు శిక్షించ లేరు. యిలాటి సూర్యారావ్‌లు చాలా మంది ఉన్నారు—ప్రతి ఊర్లో. ప్రతి సూర్యారావ్‌ని మీరు శిక్షించలేరు. హాయిగా నిద్ర పోండి" అని మృదువుగా మందలించి ప్రక్కకి తిరిగి పడుకొంది దివాకరరావ్ భార్య.

మరోగంట పోయాక అతను భార్యని తట్టి లేపాడు.

"ఏమిటండీ?" బద్ధకంగా అడిగిందామె.

"కాదు డియర్! అతన్ని పిలిపించి బెదిరిస్తే ఎలా ఉంటుందంటావ్?"

ఓ సారి దివాకరరావ్ వైపు ఆశ్చర్యంగా చూసి టైమ్ చూసింది. అర్ధరాత్రి పన్నెండు అయింది. భర్తలో దోషి అని నమ్మిన వాడ్ని శిక్షించాలనే కోర్కె ఎంత బలంగా ఉందో అర్థం అయింది ఆమెకి.

"బానే ఉంటుంది" అంది.

ఉత్సాహంగా నిద్ర పోయాడు దివాకరరావ్.

* * *

వాచ్‌మెన్ చేత పిలిపించేడు దివాకరరావ్, సూర్యారావ్‌ని ఉదయాన్నే లేస్తూ.

మాసిన జుత్తూ, గడ్డం. మనిషి మాసినట్లు కనబడ్డా బట్టలు శుభ్రంగా ఉన్నాయ్. నిర్లక్ష్యంగా నిలబడ్డాడు- నీ బంగళాలు నీ హోదాలు నన్నేం చేయలేవన్నంత ధీమాగా.

ఆ ధీమా నచ్చలేదు దివాకరరావ్‌కి. 'కోర్టులో అయితే మూడ్నెల్లు వేసేద్దును' అనుకున్నాడు.

"నీ పేరు?" అడిగేడు దివాకరరావ్.

"సూర్యారావ్."

"ఎక్కడ పని చేస్తున్నావ్?"

"భవానీ యిండస్ట్రీస్‌లో."

"రోజు కెంత వస్తుంది?"

"పదిహేను."

"అందులో తాగుడు కెంత తగలేస్తున్నావ్?"

"మీ కెందుకు?" నిర్లక్ష్యంగా అడిగేడు సూర్యారావ్.

"చెప్పు!" ఉరిమినట్లు ప్రశ్నించేడు దివాకరరావ్.

ఆ కంఠానికి జడిసేడు సూర్యారావ్.

"పదో పన్నెండో!"

"యింట్లోకి సరుకులు తేవు కదూ?"

సమాధానం చెప్పలేదు సూర్యారావ్.

"నువ్వు సంపాదించేది పదిహేను. అందులో తాగేది పన్నెండు రూపాయలిచ్చి. యింట్లోకి సరకులు తేవు. పెళ్ళి చేసుకున్నావ్. నిన్ను పెళ్ళి చేసుకున్న నేరానికి నీ యిల్లూ, నీ ఆరోగ్యం, నీ శుభ్రతా చూస్తున్న నేరానికి. తనకి కూలిగా యింత అన్నం వండుకొనేందుకు కావలసిన సరుకులు తేలేదని నీ పెళ్ళాం అడిగితే తంతావ్. అది శుభ్రంగా తయారయితే నువ్వు తంతావ్. తయారవక పోతే తంతావ్. అనవసరమైన అనుమానంతో దాన్ని హింపిస్తున్నావు.

"నేనెవరో తెలుసా? డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జీని. అంటే ఈ ఊరికి, ఈ జిల్లాకి న్యాయాధికారిని. తలుచుకొంటే నిన్ను నాశనం చెయ్యగలను. జాగ్రత్త! ఈ సారి మళ్ళీ నీ పెళ్ళాం వంటి మీద చేయి వేసావంటే జైల్లో తోయిస్తాను." బెదిరిస్తూ అన్నాడు దివాకరరావ్.

ఓ సారి కోపంగా దివాకరరావ్ వైపు చూసి బయటికి వెళ్ళిపోయాడు సూర్యారావ్.

'మరి పెళ్ళాం వంటి మీద చెయ్యి వెయ్యడు!' గర్వంగా అనుకున్నాడు జడ్జి దివాకరరావ్.

కానీ అతని అంచనా తప్పని సాయంత్రం అయేసరికి తేలిపోయింది.

అ సాయంత్రం అతని కారు గేట్లోకి అడుగు పెట్టేసరికి మళ్ళీ ప్రారంభం అయింది.

"నా పెళ్ళాం—నా యిష్టం. కొడతాను. నా యిష్టం వచ్చినట్లు నరుకుతాను. అడ్డం వచ్చేందుకు అడ్డమైన నాయాలు వాడెవడు? జడ్జీట—జడ్జీ! ఎవడికో వీడు జడ్జీ అయితే నాకేవిటి గొప్ప?" కేకలు వేస్తూ రంకెలు వేస్తూ బాదుతున్నాడు సూర్యారావ్ పెళ్ళాన్ని.

"అమ్మమ్మా! అదేం అడదండి బాబూ! ఆడహిట్లర్‌లా జణాయించేసింది. నేనూ, నా మొగుడూ ఏం అయితే మీకెందుకు అంది. మధ్యలో మీలాటి పెద్దోళ్ళు కలగజేసుకొని మరింత నరకం చేయకండి అంది. తాగకపోతే దాని మావ అంత మంచివాడు ఈ ప్రపంచంలోనే ఉండడట. ఐతే రోజు అంతా తాగుతాడని ఒప్పుకొంది. మళ్ళీ మళ్ళీ కలగజేసుకొంటే మర్యాద దక్కదని

వార్నింగిచ్చింది. ఐతే మీ మనసును అది అర్థం చేసుకోగలిగిందట. ఇక మీదట, అదే మొగుడిమీద ఫిర్యాదు చేసి మీచేత ఇలా బెదిరించిందేమో ననే అనుమానంతో మరింత హింసిస్తాడు, కొడతాడని ప్రాధేయపడింది." జడ్జి దివాకరరావ్ భార్య ఆరోజు మధ్యాహ్నం లక్ష్మి ఎలా మాట్లాడిందో అనుకరిస్తూ కూడా చెప్పసాగింది.

దివాకర్రావ్‌కి మొదట్లో నే ఇదంతా అర్థం అయిపోయింది. తన జడ్జిమెంట్ మీద ఎగినెత్తుగా హైకోర్టు జడ్జిమెంట్ ఇచ్చినట్లు ఫీలవుతున్నాడు అతను.

"మీరేం చేయలేరు-అది వాళ్ళ స్వంత వ్యవహారం కనుక. మీకెందుకీ గొడవ? మీరు కలగజేసుకోవడంవల్ల ఆ లక్ష్మి బ్రతుకు మరింత నరకం అవుతుంది తప్ప ఏమీ లాభం చేకూరదు" అంది దివాకరరావ్ భార్య.

అతనికి తనేం చేయగలడో తోచలేదు. తన అసమర్థతని అంత కన్నా పొడిగించదలచుకోలేదతను.

వారం రోజులు గడిచాయి.

దివాకరరావ్ భార్య, కొడుకు సురేష్‌తో ఊరు వెళ్ళింది.

కోర్టుకి సెలవు కనుక ఆ రోజంతా విసుగ్గా గడిపేడు దివాకరరావ్. మధ్యాహ్నం అవుతుంటే సూర్యారావు కేకలకి నిద్ర డిస్టర్బ్ అయితే లేచాడు. కాసేపు అటూ ఇటూ తిరిగి సూర్యారావుని మనసులో నాగరీకమైన తిట్లన్నీ తిట్టు కొని డాబామీద పచార్లు చేయ సాగాడు.

అతనికి సూర్యారావు గుడిసె చూస్తున్నప్పుడల్లా తన పరాజయం గుర్తుకు రాసాగింది.

ఆలోచిస్తూ పచార్లు చేస్తున్న దృష్టి సూర్యారావు పెళ్ళాం మీద పడింది. లక్ష్మి నూతి గట్టుమీద కూర్చొని ఏడుస్తోంది. ఆమె చేతిలో ఏదో ఉంది. సరిగ్గా కనపడక, రెయిలింగ్ ఆనుకొని ముందుకి వంగి చూశాడు.

ఇంతలో ఒక్కసారి మంటలు లేచాయి.

ఆమె ఆత్మహత్య చేసుకోబో తోందని ఒక్క క్షణంలో అర్థ మయింది దివాకరరావ్‌కి.

నౌకర్లని కేకేస్తూ కిందకి పరిగెత్తాడు. దుప్పట్ల సహాయంతో ఆమెని మంటల బారినుండి రక్షించ ప్రయత్నించాడు. కాని ఆమె అప్పటికే సగం కాలిపోయింది

కారు బయటకి తీయమని, ఆమెని హాస్పిటల్లో చేర్పించాడు. హాస్పిటల్లో ఎడ్మిట్ అయిన గంటకి

చాలా బాధని అనుభవించి లక్ష్మి చనిపోయింది.

ఆ బాధని చూస్తే దివాకరరావ్ గుండె చలించిపోయింది. తన నిస్సహాయత మీద అసహ్యం వేసింది.

'సూర్యారావు తప్పించుకు పోయాడు. ఇంకొక త్తెని పెళ్ళిచేసుకుంటాడు. దాని బ్రతుకూ ఇలానే అవుతుంది. నో! వీల్లేదు.'

చటుక్కున ఓ ఆలోచన స్ఫురించింది దివాకర్‌రావ్‌కి. లక్ష్మి చనిపోయే క్షణంలో ఎవరూ లేరు, దివాకరరావ్ తప్ప.

సూర్యారావుని శిక్షించే ఆలోచన తట్టింది దివాకరరావ్‌కి.

వారం రోజుల తర్వాత దివాకరరావ్ భార్యతో అన్నాడు—

"నా సర్వీసులో తీసుకున్న మొట్టమొదటి సరియైన తీర్పు ఇదే. ఎన్నో కేసుల్లో తీర్పులిచ్చినా ఇంత సంతృప్తి ఎన్నడూ కలగలేదు. సూర్యారావు పెట్టే బాధలవల్లనే లక్ష్మి చనిపోయిందని నీకూ నాకూ తెలుసు. ఇప్పుడు ఎలా లేదన్నా వాడికి పది సంవత్సరాలు శిక్ష పడుతుంది."

"ఏం చేశారు మీరు?" అడిగింది దివాకరరావ్ భార్య.

"మరణ వాంగ్మూలానికి చాలా ప్రాముఖ్యతానిస్తాం. ఆ క్షణాల్లో నేను ఉండటం పనికి వచ్చింది. ఓ మేజిస్ట్రేట్ తీసుకోవాలి మరణ వాంగ్మూలాన్ని. ఆమె ఇచ్చిన మరణ వాంగ్మూలాన్ని నేను రికార్డ్ చేశాను. అనుమానంతో తన భర్తే తనని హింసించి కాల్చి చంప ప్రయత్నం చేశాడని ఆమె వాంగ్మూలంలో ఇచ్చింది."

"నిజంగా లక్ష్మి అలా ఇచ్చిందా?"

"లేదు. ఒకవేళ మనం అడిగినా అలా ఇచ్చి ఉండేదికాదు. ఆఫ్టరాల్ హి ఈజ్ ఏ హిందూ లేడీ! ఆ క్షణంలో సూర్యారావుగాడిని శిక్షించడానికి నాకు తోచిన మార్గం అదొక్కటే. అంచేత అది ఇచ్చిన మరణ వాంగ్మూలం నేనే ఇచ్చాను-కావాలని సూర్యారావు శిక్షింపబడాలని. జడ్జీని కనుక నా మాట వేలిడ్. వాడ్ని ఇంకే విధంగానూ శిక్షించలేం. ఇదొక్కటే సరైన దారి వాడ్ని శిక్షించేందుకు" అన్నాడు దివాకరరావ్. ●

Edited & Published by VIJAYA BAPINEEDU
80, Dhanalaxmi Colony, Madras-600 026, and
Printed by him at Vijaya Graphics;
210-Arcot Road, Madras-600 026. Phone: 422233